పల్లెలు మురిసేలా..

- జోరుగా ఉపాధిహామీ పనుల జాతర
- వచ్చే సంవత్సరం మార్చి నాటికి పూర్తి చేయడమే లక్ష్యం
- జిల్లాలో రూ.39.11 కోట్లతో 3,591 పనులు



పెగడపల్లి మండలం లింగాపూర్‌లో పనులను ప్రారంభిస్తున్న మంత్రి అడ్లూరి

జిల్లా సమాచారం..

మండలాలు	20
గ్రామ పంచాయతీలు	380
ఈజీఎస్ జాబ్ కార్డులు	1.67 లక్షలు
మొత్తం కూలీల సంఖ్య	2.73 లక్షలు

జగిత్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పనుల జాతర-2025 కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలులో భాగంగా పల్లెల్లో నివసిస్తున్న నిరుపేద కూలీల జీవనోపాధి మెరుగుపరచడానికి, ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పని కల్పించడానికి వివిధ రకాల పనులు చేపట్టారు. జిల్లాలో రెండో విడతగా ఈ పనులు ప్రారంభించడమే కాకుండా కొత్త పనులకు భూమి పూజ చేస్తున్నారు. వచ్చే సంవత్సరం మార్చి నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.

● పనులకు మంత్రి అడ్లూరి, ఎమ్మెల్యేలు శంకుస్థాపన

పనుల జాతర కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా రూ.39,11,88,176 నిధులతో 3,591 పనులు చేపడుతున్నారు. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఈ పనులు ప్రారంభంకాగా ధర్మపురి అసెంబ్లీ నియోజక వర్గంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్‌లు పలు అభివృద్ధిపనులకు శంకుస్థాపనలు చేశారు. జిల్లాలో రూ.7.28 కోట్లతో 809పశువుల పాకలు, రూ.99లక్షలతో 33కోళ్ల పారాలు, రూ.98 లక్షలతో 116గొర్రెల షెడ్లు, రూ.14 లక్షలతో 72వర్మీ నాడెప్ కంపోస్టు గుంతలు, రూ.80 లక్షలతో 16 చెక్ డ్యామ్‌లు, రూ.75లక్షలతో 1,154 వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టనున్నారు. రూ.1.05కోట్లతో 658 అజోలా సాగు యూనిట్లు, రూ.1.80 కోట్లతో 145 హార్టికల్చర్ ప్లాంటేషన్‌లు, రూ.4.16 కోట్లతో 448 కమ్యూనిటీ డ్రైన్ అండ్ సోక్ పిట్స్, రూ.1.92 కోట్లతో 3 ప్లాస్టిక్ వేస్ట్ యూనిట్స్, రూ.54లక్షలతో 18కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు, రూ.76లక్షలతో 64అంగన్‌వాడీ భవనాలు, రూ.1.10 కోట్లతో 55 గ్రామ పంచాయతీ భవనాలు నిర్మాణాలు చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. ఈ పనులతో పాటు ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి పనుల జాతరలో మరిన్ని పనులు చేపట్టి పూర్తి చేయాలని కార్యాచరణ రూపొందించారు. పశువులు, గొర్ల షెడ్లు, కోళ్ల ఫామ్‌లు, కొత్త వ్యవసాయ బావుల నిర్మాణం, వన మహోత్సవం ద్వారా ఈత, తాటి, పండ్ల తోటల పెంపకం, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని యోచిస్తున్నారు.

● మెరుగవనున్న పాలన...

గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన అనంతరం పల్లె పాలన పడకేసిందన్న అభిప్రాయాలు చోటుచేసుకున్నాయి. ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో నిర్వహణ...

మిగతా 8లో

మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

కథలాపూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వచ్చే నెల 1 నుంచి నిర్వహించనున్న ఉల్లాస్ కార్యక్రమంలో మహిళలను సంపూర్ణ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో శంకర్‌నాయక్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు, సెర్ప్ వీఓఏలకు ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. రాబోవు వంద రోజుల్లో నిరక్షరాస్యులుగా మండలంలో ఉన్న 2714 మంది మహిళలను అక్షరాస్యులుగా మార్చాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు వాలంటీర్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుందన్నారు. 269 మంది వలంటీర్లను ఎంపిక చేసే ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లోకిని శ్రీనివాస్, ఏపీఎం చిన్నరాజయ్య, సీసీలు తెడ్డు అంజయ్య, విజయలక్ష్మీ, రాజేంధర్, అశోక్, మాస్టర్ ట్రైనర్లు కరుణాకర్, మహేశ్, వీఓఏలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలోని కొండగట్టు ఫీడర్ పరిధిలో ఆదివారం చెట్ల కొమ్మలు తొలగించనున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏడీఈ మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు తాటిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని తాటిపల్లి, లంబాడిపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలి

-ఎస్పీ అశోక్ కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సెప్టెంబర్ 13న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. గణేష్ నవరాత్రులు ప్రశాంతంగా జరిగేలా భద్రతా ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు ఆయన ఆదేశించారు. పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించి పురోగతి సాధించాలన్నారు. దొంగతనాల నివారణకు రాత్రి పూట పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్ఠ పరచాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులతో కలిసి ప్రమాదాల నివారణకు రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వినాయక నిమజ్జన వేడుకల సందర్భంగా డీజేలకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు ఇవ్వవద్దని ఆదేశాలు జారీ చేశారు. సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. విధి నిర్వాహణలో అంకిత భావంతో పనిచేసిన పోలీస్ అధికారులకు ప్రశంస పత్రాలు అందించి అభినందించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు వెంకట రమణ, రఘు చందర్, రాములు, వెంకట రమణ, డీసీఆర్‌బీ, ఎస్‌బీ, ఐటీ కోర్, సీసీఎస్ ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాస్, ఆరీఫ్‌అలీ ఖాన్, రఫీక్ ఖాన్, శ్రీనివాస్, ఆర్ఐలు కిరణ్ కుమార్, వేణు, సీఐలు కరుణాకర్, సుధాకర్, రాంనర్సింహా రెడ్డి, సురేష్, అనీల్ కుమార్ తదితరులు ఉన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి ఘన నివాళి



సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జగిత్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పట్ల ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. జగిత్యాలలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్మిక వర్గానికి సురవరం చేసిన సేవలను కొనియాడారు. ఆయన మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని పలువురు నాయకులు అన్నారు.

భవన నిర్మాణాల్లో నిబంధనలు పాటించాలి

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాల్లో నిబంధనలు పాటించాలని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపట్టరాదని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని మోతె, కండ్లపెల్లి చెరువుల శుద్ధి కోసం ఏడు కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థుల కోసం రూ.6 కోట్లతో నిర్మిస్తున్న అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్ నిర్మాణం పూర్తి కావచ్చిందన్నారు. రూ.5 కోట్లతో ఇందిరావక్తి భవనం నిర్మాణంలో ఉందన్నారు. బీట్ బజార్‌లో వెజ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను వచ్చే వారం ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. గాంధీనగర్‌లో రోడ్డు ప్రమాదాలు నివారణకు కేంద్ర ప్రభుత్వం ద్వారా 18 కోట్లతో నాలుగు వరుసల బ్లాక్ స్పాట్ రోడ్డు నిర్మించామన్నారు. కాంట్రాక్టర్‌లు పనులు నాణ్యతతో చేయాలన్నారు. పనులు చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోలి శ్రీనివాస్, బాలె శంకర్, సమిండ్ల శ్రీనివాస్, పంబాల రాము, జుంబర్తి రాజ్‌కుమార్, బొడ్ల జగదీష్, కూతురు రాజేశ్, రజక సంఘం అధ్యక్షులు రవి, ఉపాధ్యక్షులు రమేష్, ఏతఈ శరన్, టీఎంసి రజిత పాల్గొన్నారు.

కళాశాలల్లో డిజిటల్ క్లాసులు సక్రమంగా నిర్వహించాలి

● జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నారాయణ



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నారాయణ

బీర్‌పూర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో డిజిటల్ క్లాసులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నారాయణ అన్నారు. శనివారం బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి డిజిటల్ తరగతులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించి ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్, డిజిటల్ తరగతుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామక్రిష్ణ, కళాశాల సిబ్బంది ఉన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

జగిత్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నారీ మహిళా ఆరోగ్య సంకల్పం ప్రియదర్శిని ఉడాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం న్యాప్ కిన్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉచితంగా శానిటరీ న్యాప్కిన్ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో జగిత్యాల పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పిప్పరి అనిత, శోభారాణి, సరిత, చిట్ల లత, రేణుక, పద్మ, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ అలియా పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

● అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాల, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవ రాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత కోరారు. రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు, పండుగ నేపథ్యంలో కమిటీ సభ్యులతో, ఏర్పాట్లపై అధికారులతో కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత మాట్లాడుతూ మున్సిపల్, విద్యుత్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో జిల్లాలో లో-లెవల్‌లో ఉన్న విద్యుత్ తీగలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

గణేష్ నిమజ్జనానికి వెళ్లే రూట్లలో విద్యుత్ తీగల విషయంలో ఆ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ కలెక్టర్ ఆదేశించారు. రూట్ క్లియరెన్స్‌ను సమర్పించాలని అన్నారు. వేడుకల కోసం లైటింగ్, శానిటేషన్, బ్లీచింగ్ వంటి పనులను మున్సిపల్ ఆధ్వర్యంలో పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. అగ్నిమాపక, మైనింగ్, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలు, అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. వినాయక నిమజ్జనం రోజున సాధ్యమైనంత త్వరగా విగ్రహాలను నిమజ్జన ఉత్సవానికి తరలించాలని కోరారు. విగ్రహాలను నిమజ్జనానికి తరలించే రూట్లలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చూడాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచుతామని తెలిపారు. ప్రత్యేకంగా రాత్రి సమయాల్లో మండపాల నిర్వాహకులు అందుబాటులో ఉండాలని సూచించారు. పండుగలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకొని అధికారులకు సహకరించాలని కోరారు. సమావేశంలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, జివాకర్ రెడ్డి, శ్రీనివాస్ డీఎస్పీ రఘు చందర్, జిల్లా అధికారులు ఉత్సవ కమిటీ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

పడకేసిన బయో మైనింగ్

● వినియోగంలో లేని ప్లాంట్

● మెట్‌పల్లిలో పేరుకుపోతున్న ఘన వ్యర్థాలు

6

సీపీఎస్‌ను రద్దు చేయాలి

● తపస్ ఆధ్వర్యంలో తహసీల్దార్లకు వినతి

8

వృద్ధుల సంరక్షణ బాధ్యత వారసులదే..

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి

రాయికల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల సంరక్షణ బాధ్యత వారి వారసులదేనని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జగిత్యాల జిల్లా న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఇటిక్యాల గ్రామంలోని నివేదిత వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వచట్టాలు, వయోవృద్ధుల సంరక్షణ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వృద్ధాశ్రమంలోని వంటశాల, వసతి గదులు, డైనింగ్ హాల్, స్టోర్‌రూమ్, పరిసరాలను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందించి వృద్ధుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. తమ వారసుల ద్వారా ఇబ్బందులు ఎదుర్కొనేవారికి న్యాయ సహాయం కోసం వారానికి ఒకసారి ఆశ్రమానికి లాయర్లు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు సుగాలి నారాయణ, సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ వెంకట మల్లిక్ సుబ్రహ్మణ్య శర్మ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.లావణ్య, రెండవ తరగతి న్యాయమూర్తులు గంప కరుణాకర్, ఏజీఎం ఓంప్రకాష్, లీగల్ హెడ్ డిఫెన్స్ కౌన్సిల్ చంద్రమోహన్, సతీష్, విజయ్ కృష్ణ, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ నరేష్, తహసీల్దార్ ఉదయ్ కుమార్, సీడీపీవో వరలక్ష్మి, ఏఎస్సై దేవేందర్, ఆశ్రమ నిర్వాహకులు భరత్‌రెడ్డి, మహిపాల్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి



కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

జగిత్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏఓ హకీంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు నాణ్యమైన ఫోన్లు ఇవ్వకపోవడం వల్ల ఎఫ్ఆర్ఎస్‌లో ఫేస్ క్యాప్చర్ కావడం లేదన్నారు. యాప్‌లో హాజరు పడడం లేదని దీనితో టార్గెట్ పూర్తి చేయలేదంటూ అధికారులు తమపై ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు టేకుమల్ల సమ్మయ్య, ఏఐటీయూసీ నాయకులు సుతారి రాములు, ఉపాధ్యక్షులు మునుగోరి హన్మంతు, సాయిశ్వరి, భాగ్యలక్ష్మీ వెన్న సురేష్, వెన్న మహేష్, బైరి వనితా తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

● కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. శనివారం మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని విధిత్ గార్డెన్‌లో కల్యాణ లక్ష్మి, షాధిముబారక్ 130 మందికి రూ.1,30,15,080ల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్‌తో పాటు స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ప్రగతి కుంటుపడిందన్నారు. కరోనా కష్టకాలంలోనూ పింఛన్లు అందించిన ఘనత తెలంగాణ కేసీఆర్‌కే దక్కిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను విస్మరించి, కల్లబొల్లి మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నరని తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, నాయకులు పుల్ల జగన్‌గౌడ్, ఒజ్జెల శ్రీనివాస్, డాకూరి వెంకటేష్, ఆకుల ప్రవీణ్, తేజ, తహసీల్దార్ నీత, ఆర్ఐలు కాంతయ్య, ఉమేష్ పాల్గొన్నారు.

హత్యకేసులో మరో ముగ్గురు అరెస్టు

గంగాధర, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గంగాధరలో వృద్ధురాలి హత్య కేసులో ప్రధాన నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు ఎస్‌ఐ వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం గంగాధర గ్రామానికి చెందిన పెగుడ మల్లవ్వ(70)ను ఈనెల 17న హత్య చేశారు. ఈ కేసులో ఈనెల 20న ఇద్దరు నిందితులను పట్టుకోగా ప్రధాన నిందితుడు నాగిరెడ్డిపూర్‌కు చెందిన గంగరాజు, మరో ఇద్దరు సహ నిందితులు పరారీలో ఉన్నారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి శనివారం పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులవద్ద మూడు తులాల బంగారం, రెండు సెల్‌ఫోన్ల స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థినులను కరిచిన ఎలుకలు

- విచారణ చేపట్టిన ఎంఈవో



కేజీబీవీలో విచారణ చేపడుతున్న ఎంఈవో లక్ష్మీనారాయణ

శంకరపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేశవపట్నం కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న తొమ్మిది మంది విద్యార్థునులను గురువారం రాత్రి ఎలుకలు కరిచాయి. విషయం తెలుసుకున్న ఎంఈవో లక్ష్మీనారాయణ, ఎంపీవో ప్రభాకర్, మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ కేజీబీవీని శనివారం సందర్శించారు. ఎలుకల దాడిలో గాయపడిన విద్యార్థునులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఘటనపై అధికారులు వివరాలు సేకరించారు. ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు.

సౌదీ అరేబియా జైల్లో గుండెపోటుతో వ్యక్తి మృతి

- స్వగ్రామం చేరిన మృతదేహం



రాజయ్య(ఫైల్)

వేములవాడ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గ్రామానికి చెందిన దండుగుల రాజయ్య(50) అనే వ్యక్తి ఉపాధి కోసం సౌదీ అరేబియా దేశం వెళ్లాడు. అతను వెళ్లింది విజిట్ వీసా కావడంతో జూలై 24వ తేదిన అక్కడి పోలీసులు జైలుకు పంపారు. జూన్ 30వ తేదిన జైల్లో ఉండగానే గుండెపోటుతో రాజయ్య మృతిచెందాడు. దీంతో రాజయ్య మృతదేహం శుక్రవారం రాత్రి స్వగ్రామం చేరుకుంది. మృతుడికి భార్య రాజమణి, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

పడకేసిన బయోమైనింగ్

- వినియోగంలో లేని ప్లాంట్
- మెట్‌పల్లిలో పేరుకుపోతున్న ఘన వ్యర్థాలు



డంపింగ్ యార్డు వద్ద బయో మైనింగ్ ప్లాంట్ (ఫైల్)

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లోని డంపింగ్ యార్డుల్లో పేరుకుపోతున్న చెత్త నిల్వలను తగ్గించడంతో పాటు ఎరువు తయారు చేసేందుకు మెట్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన బయో మైనింగ్ ప్లాంట్ పడకేసింది. పేరుకుపోతున్న ఘన వ్యర్థాల సమస్యను పరిష్కరించేందుకు గత జూలైలో పట్టణంలోని గోధుర్ రోడ్‌లో ఉన్న డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసిన బయో మైనింగ్ ప్లాంట్ వినియోగించడం లేదు. డంపింగ్ యార్డులో వందల మెట్రిక్ టన్నులకు పైగా చెత్త పేరుకుపోయింది. జీరో డంపింగ్ యార్డు లక్ష్యంగా బయో మైనింగ్ ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు అధికారులు చెత్తను శుద్ధి చేయకపోవడంతో మెట్‌పల్లిలో డంపింగ్ యార్డు పూర్తిగా నిండిపోయింది. పక్కన ఉన్న ఖాళీ స్థలంలో



డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త చెదారం

కూడా చెత్త నిండిపోయిం ది. దీంతో డంపింగ్ యార్డు చుట్టు పక్కల వ్యవసాయం చేసే రైతులు అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారు. చెత్త పేరుకుని చుట్టు పక్కల దుర్వాసన రావడంతో పాటు డంపింగ్ యార్డు వద్ద కుక్కల బెడద కూడా అధికంగా ఉన్నది. డంప్ యార్డు పక్కన వ్యవసాయ పనులకు కూలీలు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘన వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుద్ధి చేయించాల్సిన అధికారులు వర్షాలను సాకుగా చూపుతున్నారు.

జీరో డంపింగ్ యార్డులే లక్ష్యం

మున్సిపాలిటీలలో రోజురోజుకు పెరుకుపోతున్న చెత్త ఘన వ్యర్థాలను శుద్ధి చేసి జీరో డంపింగ్ యార్డులే లక్ష్యంగా ప్రభుత్వం బయో మైనింగ్‌కు శ్రీకారం చుట్టింది. పట్టణంలో నిత్యం టన్నులకు టన్నులు ఉత్పత్తి అవుతున్న చెత్తను పారిశుధ్య కార్మికులు సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తు న్నారు. డంపింగ్ యార్డులో నిల్వ ఉన్న వ్యర్థాలను దహనం చేయడం వల్ల వచ్చే పొగతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ పొగతో సమీప ప్రాంతాల వారు అనారోగ్యం పాలయ్యే అవకా శముంది. పెద్ద ఎత్తున చెత్త పోగుకావడంతో స్థలం సరిపోక నిల్వ ఉంచడం కష్టంగా మారింది. జాతీయ హరిత ట్రిబ్యునల్ మార్గదర్శకాల ప్రకారం మున్సిపాలిటీలలో వ్యర్థాలను కరిగించేందుకు ప్రభుత్వం బయో మైనింగ్ ప్లాంట్‌కు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో మొదటగా జగిత్యాల, కోరుట్ల మున్సిపాలిటీలలో ఏర్పాటు చేశారు. అనంతరం మెట్‌పల్లిలో ఏర్పాటు చేశారు. ఇప్పటికే జగిత్యాల, కోరుట్లలో బయో మైనింగ్ విజయవంతంగా సాగు తోంది. చెత్తతో బయో మైనింగ్ ద్వారా ఎరువు తయారు చేస్తున్నారు. మెట్ ఎల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన బయోమైనింగ్ కొన్ని రోజులు నడిపించి నిలిపివేశారు. వర్షాల కారణంగా శుద్ధి పనులు నిలిపివేసినట్లు అధికారులు చెపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బయో మైనింగ్ చేపట్టాలని మెట్‌పల్లి పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే ప్రారంభిస్తాం

-టి. మోహన్, మున్సిపల్ కమిషనర్, మెట్‌పల్లి



వర్షాల కారణంగా బయో మైనింగ్ శుద్ధి పనులు నిలిచిపోయాయి. డంపింగ్ యార్డులో ప్రస్తుతం 32 వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉంది. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే శుద్ధి పనులు చేపడుతాం. నాలుగు నెలల్లో పూర్తి స్థాయిలో జీరో డంపింగ్ యార్డుగా తీర్చిదిద్దుతాం.

ఇసుక ట్రాక్టర్ పైనుంచి పడి యువకుడి మృతి



నర్రా శేఖర్(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ గ్రామ శివారులోని దొంగలమర్రి దగ్గర శుక్రవారం రాత్రి ఇసుక ట్రాక్టర్‌పై నుంచి పడి నర్రా శేఖర్ (29) అనే యువకుడు మృతిచెందాడు. మృతుడి బంధువులు, ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మెట్‌పల్లి మండలం ఆత్మనగర్ గ్రామానికి చెందిన శేఖర్ అదే గ్రామానికి చెందిన బండ శ్రీనివాస్‌కు సంబంధించిన ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గ్రామంలో డంప్ చేసిన ఇసుకను బండలింగాపూర్‌కు తరలించేందుకు దాండ్ల రవి అనే వ్యక్తితో నర్రా శేఖర్ ట్రాక్టర్‌తో వెళ్లారు. దాండ్ల రవి ట్రాక్టర్‌ను నడుపుతుండగా శేఖర్ వెనుకలా ఉన్నాడు. ఈ క్రమంలో జగ్గసాగర్ గ్రామ శివారులో దొంగలమర్రి వద్ద ప్రమాదవశాత్తు నర్రా శేఖర్ ట్రాక్టర్‌పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. శేఖర్ భార్య ఏడు నెలల గర్భవతి కాగా, అతడికి 20 నెలల కూతురు ఉంది. శేఖర్ కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి బంధువులు మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌కు పెద్దఎత్తున తరలివచ్చారు. నిందితులపై కేసు నమోదు చేసి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఎస్సై సముదాయించడంతో బాధితులు వెనుతిరిగి వెళ్లారు.

అనారోగ్యం.. ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



లోకేష్(ఫైల్)

తంగళ్లపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం.. ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఉరివేసుకుని అత్మహత్యకు పాల్పడిన సంఘటన తంగళ్లపల్లి మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు కథనం ప్రకారం.. తంగళ్లపల్లికి చెందిన ముద్రకోల తిరుపతి-సుశీల దంపతులకు కుమారుడు లోకేష్(26), కూతురు కావ్యలు ఉన్నారు. లోకేష్ ఇంటర్ మీడియెట్ పూర్తి చేశాడు. సోదరి అనారోగ్యం భారినపడగా తల్లిదండ్రులు వైద్యం కోసం అప్పులు చేశారు. కుటుంబానికి చేదోడుగా ఉండాలని భావించి హైదరాబాద్‌లో ప్రైవెట్ ఉద్యోగంలో చేరాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురై ఉద్యోగం మానేసి స్వగ్రామంలో తల్లిదండ్రుల వద్దకు చేరాడు. అనారోగ్యంతోపాటు అప్పులు, వైద్యం చేయించుకునే పరిస్థితి లేక శనివారం తెల్లవారు జామున ఇంట్లో ఉరి వేసుకుని లోకేష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్లూకోల్ట్స్ పోలీసుల విధులకు ఆటంకం

- ముగ్గురు యువకులపై కేసు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బ్లూకోల్ట్స్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆరెపల్లికి చెందిన రాకేష్, అచ్యుత్, గుండిగోపాల్‌రావుపేటకు చెందిన ప్రవీణ్ అర్ధరాత్రి సమయంలో గ్రామంలోని దర్గా వద్ద రోడ్డు పక్కన మద్యం తాగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఈ క్రమంలో వివరాలు అడిగిన బ్లూకోల్ట్స్ పోలీసులను నెట్టివేసి, ట్యాబ్‌ను లాక్కున్నారు. ఈ ఘటనలో వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

వెల్గటూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల కేంద్రంలో వరంగల్-రాయపట్నం ఏడో నంబరు రాష్ట్ర రహదారిపై శనివారం నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీ 05 టీజీ 0555 నంబరు గల లారీ అతి వేగంగా ఆ వ్యక్తిని వెనుక వైపు నుంచి ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి.

గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుడిని జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. కాగా తీవ్ర గాయాలైన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అతనికి సంబంధించిన వివరాలు లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక

హుజూరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన చల్లూరి శ్రీధర్ ఈ నెల 31న హైద్రాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 22న జిల్లా కేంద్రంలో జరిగిన యోగా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శ్రీధర్ ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వస్త్రవ్యాపారులకు కుచ్చుటోపీ

- రూ. రెండు కోట్లతో ఉడాయించిన తమిళనాడు వ్యాపారి



గర్షకుర్తిలో తాళం వేసిన ఉన్న టెక్స్‌టైల్ దుకాణం

గంగాధర, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్షకుర్తిలో ఆసాములు తయారు చేసిన వస్త్రాలను ఉద్దెరకు కొనుగోలు చేసి నమ్మించి రెండు కోట్లకు పైగా కుచ్చుటోపీ పెట్టిన తమిళనాడు వ్యాపారి మోసం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల ప్రకారం కొన్ని సంవత్సరాలుగా గర్షకుర్తిలో మగ్గాలపై తయారు చేసిన గోచి చీరెలు, తువ్వాలలు, దస్తీలను ఇక్కడి ఆసాములు ఇతర జిల్లాలకు వెళ్లి విక్రయించేవారు. దీన్ని ఆసరాగా చేసుకొని ఎనిమిది నెలల క్రితం తమిళనాడు రాష్ట్రం, క్రిష్ణగిరి జిల్లా పెరుగోపనపల్లికి చెందిన వినోద్‌రాజ్, మరో ముగ్గురు కలిసి హోల్‌సెల్ డీలర్ పేరిట కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తిలో అద్దె భవనాన్ని తీసుకుని వ్యాపారం ప్రారంభించారు. అయితే గతంలో గర్షకుర్తిలో తయారు చేసిన గోచి చీరలతో పాటు తువ్వాలలు, దస్తీలను ఇతర జిల్లాలకు వెళ్లి అమ్ముకునే ఆసాములు ఇక్కడే హోల్‌సెల్‌గా తమిళనాడుకు చెందిన వ్యాపారులకు అమ్ముకునేవారు. మొదట్లో వస్త్రాలు తీసుకుని డబ్బులు సక్రమంగా ఇచ్చి వ్యాపారులను నమ్మించారు. కొద్దిరోజులకు వీరి వ్యాపారం గర్షకుర్తితో పాటు కొత్తపల్లి, సిరిసిల్ల, కరీంనగర్ చామనపల్లి వరకు చేరింది. వ్యాపారం జోరందుకోగానే అమ్మిన సరుకు సగం డబ్బులు వ్యాపారులకు ఇచ్చి మిగతావి ఇస్తానని దాటవేశాడు. ఇలా ఒక్కొక్కరి వద్ద పది లక్షల రూపాయల నుంచి 15 లక్షల రూపాయల వరకు కొనుగోలు చేసి చీరలు, దస్తీలు, తువ్వాలలతో వారం క్రితం రాత్రికి రాత్రి ఉడాయించారు. సరుకులు తీసుకున్న వ్యాపారికి ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ రావడంతో మోసపోయామని గ్రహించిన వ్యాపారులు పోలీసులను ఆశ్రయించారు. సదరు తమిళనాడు వ్యాపారులపై కేసు నమోదు చేసిన గంగాధర ఎస్సై వంశీకృష్ణ విచారణ చేపడుతున్నామని తెలిపారు.

ఎస్‌యూ ఇంజనీరింగ్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

గణేశ్‌నగర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం గాంధీనగర్ (హుస్నాబాద్)లోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 26వ తేదీన స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ కె తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీఎస్‌ఈ, ఈసీఈ, సీఎస్‌సీ, సీఎస్‌సీఏఐలో స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు కళాశాల మొదటి అంతస్థులో హాజరుకావాలని తెలిపారు. ఇప్పటి వరకు ఎక్కడా అడ్మిషన్ తీసుకోని వారికి అవకాశం ఉంటుందని, వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ www.satavahana.ac.inను సందర్శించాలని సూచించారు.

నిజామాబాద్‌లో చోరీ

కోనరావుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి నగదును దోచుకెళ్లారు. ఎస్సై ప్రశాంత్‌రెడ్డి కథనం ప్రకారం... నిజామాబాద్ గ్రామానికి చెందిన ముస్కం లింబాద్రి ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి 28 వేల రూపాయల నగదు, 17 తులాల వెండిని బీరువా తాళం పగలగొట్టి దోచుకెళ్లారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

పలు మండలాల్లో పోలీసుల కవాతు

హుజూరాబాద్/జమ్మికుంట/వీణవంక, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక మండలంలోని చల్లూరు గ్రామంలో వినాయక చవితి, దేవి నవరాత్రుల ఉత్సవాలల్లో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో శనివారం జవాన్లు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా రాపిడ్ యాంటీ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ టీపీ భగెల్ మాట్లాడుతూ నవరాత్రుల ఉత్సవాలు ప్రజలు చాలా సంతోషంగా, ఎలాంటి అల్లర్లు జరగకుండా శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. తెలంగాణలోని పట్టణాల్లో, గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయంగా కవాతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో శాంతి భద్రతల కోసం రాజకీయ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, యువత శాంతియుత మార్గంలో సంరక్షించుకోవాలని సూచించారు. అనంతరం జవాన్లను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో సీఐలు కరుణాకర్, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, ఎస్‌ఐలు నాగరాజు, తిరుపతి, క్రాంతికుమార్, పోలీస్ సిబ్బంది, జవాన్లు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లికి చెందిన బుక్క హరీష్ ఈ నెల 5న విద్యారణ్యపురిలో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నిలజీతో ఫోన్ గోదావరిఖనిలో ఉన్నట్లుగా గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ రూరల్ ఠాణాలో శనివారం హరీష్‌కు సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్ అప్పగించారు.

డీజే నిర్వాహకుల బైండోవర్

రామడుగు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): త్వరలో రానున్న గణేష్ ఉత్సవాలను నేపథ్యంలో రామడుగు మండలం పరిధిలోని డీజే సౌండ్ నిర్వహించే వ్యక్తులను ముందస్తు చర్యల్లో భాగంగా తహసీల్దార్ ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు. బైండోవర్‌ను అతిక్రమించి డీజే సౌండ్ గణేష్ ఉత్సవాల్లో వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రామడుగు ఎస్‌ఐ కె రాజు హెచ్చరించారు.

నాందేడ్ నుంచి తిరుపతి మీదుగా ధర్మవరానికి ప్రత్యేక రైలు

- సెప్టెంబరు 5 నుంచి నడవనున్నరైలు

పెద్దపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని పెద్దపల్లి జంక్షన్ మీదుగా మరొక ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును దక్షిణ మధ్య రైల్వే జోన్ నాందేడ్ డివిజన్ రైల్వే అధికారులు నడపనున్నారు. ఈ రైలు వచ్చే నెల 5వ తేదీ నుంచి ప్రతీ వారం నాందేడ్ నుంచి ధర్మవరం వరకు నడుస్తుంది. 07189 నాందేడ్ నుంచి ధర్మవరం ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం నాందేడ్‌లో సాయంత్రం 4:30 నిమిషాలకు బయలుదేరి, బాసర నుంచి 6 గంటలకు, నిజామాబాదు జంక్షన్ 6:25 గంటలకు, జగిత్యాల రాత్రి 8 గంటలకు, కరీంనగర్ రాత్రి 9 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 10:05 గంటలకు, వరంగల్‌కు రాత్రి 11:40 గంటలకు చేరుకుంటుంది. తిరుపతికి శనివారం ఉదయం 11 గంటలకు, పాకాల జంక్షన్, పీలేరు, మదనపల్లి రోడ్డు, కదిరి రైల్వే స్టేషన్ల మీదుగా, ధర్మవరం జంక్షన్‌కు సాయంత్రం 5 గంటలకు చేరుకుంటుంది. ఈ రైలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో లింగంపేట జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జంక్షన్, జమ్మికుంట రైల్వే స్టేషన్‌లలో ఆగుతుంది. ఈ రైలు సెప్టెంబర్ 5, 12, 19, 26 తేదీల్లో నడవనున్నది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు నంబర్ 07190 ధర్మవరంలో సెప్టెంబర్ 7, 14, 21, 28 తేదీల్లో ప్రతీ ఆదివారం ఉదయం 5:39 గంటలకు ఆరంభమై, ఆ మరుసటి రోజు ఉదయం 7:30 గంటలకు నాందేడ్‌కు చేరుకుంటుంది. పెద్దపల్లి జంక్షన్‌కు సోమవారం మధ్యాహ్నం 12:05 గంటలకు చేరుకుంటుంది.

పాడి ఆవు.. లేగదూడను ఎత్తుకెళ్లిన దుండగులు

శంకరపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన ఓ రైతు పాడి ఆవు, లేగ దూడను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి ఎత్తుకెళ్లారు. బాధిత పాడి రైతు చిలివేరు మధునయ్య రోజు లాగానే సాయంత్రం ఆవు, లేగ దూడను తన పొలం వద్ద మేత వేసి కట్టేసి వచ్చాడు. శనివారం తెల్లవారు జామున వెళ్లి చూసేసరికి ఆవు, లేగ దూడను గుర్తు తెలియని వ్యక్తులు తరలించుకుపోయారని లబోదిబోమన్నాడు. వాటి విలువ సుమారు రూ. 80 వేల వరకు ఉంటుందన్నారు. ఆవు, లేగ దూడ అపహరణపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపారు.

అర్బన్ బ్యాంకు ఎన్నికలకు కసరత్తు

- సెప్టెంబరు 30లోగా నిర్వహణకు ఏర్పాట్లు - 9100 ఓట్లతో ఓటరు జాబితా సిద్ధం - కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పాలక వర్గ ఎన్నికల నిర్వహణకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. తాత్కాలిక ప్రస్తుత పాలకవర్గ పదవీకాలం అక్టోబరు 13తో ముగియనున్నందున ఆలోగా ఎన్నికలను నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ కారణాలతో కొన్ని సంవత్సరాలుగా పాలకవర్గ ఎన్నికలు వాయిదా పడడంతో పాలకవర్గాలను ప్రభుత్వం నియమిస్తోంది. పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలంటూ కోర్టు ఆదేశించడంతో అధికారులు, ప్రస్తుత పాలకవర్గ సభ్యుల సహకారంతో ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తోంది. బ్యాంకు సభ్యత్వాల్లో అవకతవకలకు పాల్పడ్డారని అధికారుల ప్రాథమిక విచారణతో కోర్టు గత పాలకవర్గంలోని 15 మంది సభ్యుల సభ్యత్వాలను తొలగించాలంటూ ఈ నెల 1న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ నెల 3న నిర్వహించిన పాలకవర్గ సర్వసభ్య సమావేశంలో 15 మంది సభ్యులను శాశ్వతంగా తొలగిస్తున్నట్లు తీర్మానించారు. దీన్ని ఖండించిన ఆనాటి పాలకవర్గ సభ్యులు కోర్టును ఆశ్రయించడంతోపాటు జిల్లా సహకార శాఖ అధికారిని కలిసి సభ్యత్వాల రద్దు విషయమై పలు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. తాము అవకతవకలకు పాల్పడలేదని, సంజాయిషీ నోటీసు ఇవ్వకుండా అభిప్రాయాలను స్వీకరించకుండా కొందరు అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికతో సభ్యత్వాలు రద్దు చేయడం సరికాదని పేర్కొన్నారు. అంతేకాకుండా సర్వసభ్య సమావేశం ఎజెండాలో సభ్యత్వాల రద్దు విషయాన్ని చేర్చకపోవడం చట్ట విరుద్ధమని, దీనిపై చర్య తీసుకోవాలని కోరారు. దీంతో జిల్లా సహకార శాఖ అధికారి బ్యాంకు పాలకవర్గం సభ్యుల సభ్యత్వాల రద్దుపై తీసుకున్న నిర్ణయం సరికాదని, మళ్లీ నిర్ణయం తీసుకోవాలంటూ ఇటీవల పాలకవర్గానికి లేఖ పంపించారు. ఈ నేపథ్యంలో గత పాలకవర్గ సభ్యుల సభ్యత్వాల రద్దుపై సస్పెన్షన్ కొనసాగుతోంది.

మరోవైపు ఎన్నికలు నిర్వహించాలంటూ ఇప్పటికే కోర్టు ఆదేశించడం, ప్రస్తుత పాలకవర్గం కూడా ఎన్నికలు నిర్వహిస్తామని కోర్టుకు చెప్పడంతో పాలకవర్గ ఎన్నికలు అనివార్యంగా మారాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలను నిర్వహించేందుకు బ్యాంకు అధికారులు సహకార చట్టం నిబంధనల మేరకు ఓటరు లిస్టును సిద్ధం చేసి జిల్లా సహకారశాఖ అధికారికి, ఉన్నతాదికారులకు పంపించినట్లు తెలిసింది. మరోవైపు గత ఓటరు లిస్టును సవరించి 9,100 పైచిలుకు ఓట్లతో ఓటరు జాబితాను సిద్ధం చేశారు. ఈసారి డివిజన్ల వారీగా ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కరీంనగర్, జగిత్యాల బ్రాంచీల్లో ఓటర్లు ఉన్నందున కరీంనగర్‌లో 10 డివిజన్లుగా, జగిత్యాలలో ఒక డివిజన్‌ను ఏర్పాటు చేసి దాదాపు 1,000 ఓట్లతో ఒక్కో డివిజన్ ఉండేలా చర్యలు చేపట్టారు. ఓటరు జాబితాతోపాటు డివిజన్ల వారీగా ఎన్నికలు నిర్వహించేందుకు దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని, ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే ఎన్నికలను నిర్వహిస్తామని అధికారులు, ప్రస్తుత పాలకవర్గ చైర్మన్ తెలిపారు.

మరోవైపు కాంగ్రెస్‌కు చెందిన ప్రస్తుత పాలకవర్గంతోపాటు మాజీ పాలకవర్గ సభ్యులు ఎన్నికల్లో ఆమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్‌కు చెందిన రెండు గ్రూపులు విమర్శలు గుప్పించుకుంటూ అర్బన్ బ్యాంకు రాజకీయాలను రసవత్తరంగా మార్చుతుండగా బీజేపీ, బీఆర్ఎస్ ఇతర పార్టీలు పెద్దగా ఆసక్తి చూపినట్లు కనిపించడం లేదు.

బడికి తాళం వేసి తల్లిదండ్రుల నిరసన



తాళం వేసి నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పాఠాలు చెప్పేందుకు పాఠశాలలో ఒక్కరే ఉపాధ్యాయుడు ఉండడం వల్ల తమ పిల్లలు నష్టపోతున్నారని, మరో ఉపాధ్యాయుడిని కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధాన గేటుకు శనివారం తాళం వేసి తల్లిదండ్రులు విద్యార్థులతో కలిసి నిరసనకు దిగారు. బడిలో మొత్తం 28 మంది విద్యార్థులుండగా ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహించేవారని పేర్కొన్నారు. ఇటీవల ఓ ఉపాధ్యాయినిని విద్యా శాఖ అధికారులు డిప్యూటేషన్‌పై వేరే మండలానికి పంపించారని చెప్పారు. ఒక్కరే ఉపాధ్యాయుడు అన్ని తరగతులకు ఎలా బోధిస్తారని ప్రశ్నించారు. సుమారు గంటపాటు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న విద్యాశాఖ అధికారులు స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులతో సెల్‌ఫోనులో మాట్లాడి ఉపాధ్యాయుడిని కేటాయించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

కోర్టును ఆశ్రయించిన అదనపు కమిషనర్ సువార్త

కరీంనగర్ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ జె సువార్త హైకోర్టును ఆశ్రయించారు. విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని ఆమెపై అసంతృప్తితో ఇటీవల మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సీడీఎంఏకు సరెండర్ చేశారు. అయితే ఆమె సీడీఎంఏకు వెళ్లకుండా యధావిధిగా రెండు రోజల పాటు కార్యాలయానికి వచ్చి తన ఛాంబర్‌లో కూర్చున్నారు. విషయం తెలుసుకున్న కమిషనర్ శుక్రవారం ఆమెకు కేటా యించిన విధులను ఇతర అధికారులకు అప్పగిస్తూ సర్క్యులర్ జారీ చేశారు. ఆమె వద్ద నుంచి రికార్డులను స్వాధీనం చేసుకోవాలని, ఛాంబర్ ఖాళీ చేయించాలని ఆదేశించారు. దీంతో అధికారులు ఆమె ఛాంబర్ తాళం పగులగొట్టి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై అసంతృప్తిగా ఉన్న ఆమె హైకోర్టును ఆశ్రయించి న్యాయం చేయాలని కోరగా హైకోర్టు స్పందిస్తూ స్టేటస్‌కో మెయింటేన్ చేయాలని, తదుపరి విచారణ అక్టోబరు 8వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులిచ్చింది.

రోడ్డు బాగుచేయాలని విద్యార్థుల రాస్తారోకో

ఇల్లంతకుంట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) గుంతల రోడ్డుపై వెళ్లలేమంటూ విద్యార్థులు రాస్తారోకో చేపట్టారు. మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాలకు వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు ప్రతిరోజు ఆటోల్లో వస్తుంటారు. అనంతారం, రహీంఖాన్‌పేట, వెల్జిపూర్, ఒగులాపూర్ తదితర గ్రామాల రోడ్లు పూర్తిగా చెడిపోయాని పేర్కొంటు శనివారం పాఠశాల విద్యార్థులు నిరసన తెలిపారు. విద్యార్థులకు ఏబీవీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా రాష్ట్ర నాయకుడు అక్కెం నాగరాజు మాట్లాడుతు మండలంలోని రోడ్లు పూర్తిగా చెడిపోయాయని చిన్నవర్షాలకే పొలాలను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థులు సమయానికి రాలేకపోతున్నారని పేర్కొన్నారు.

రోడ్లు బాగుచేయాలని అనేకసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకపోతామని నచ్చజెప్పడంతో విద్యార్థులు నిరసన విరమించారు.



రహీంఖాన్‌పేటలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

వ్యవసాయ క్షేత్రంలో నిఘా నేత్రం

- సోలార్ సిస్టంతో సీసీ కెమెరా ఏర్పాటు



ఎండపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మోటర్లు చోరీకి గురి కాకుండా ఎండపల్లి మండలం మారేడుపల్లి గ్రామానికి చెందిన తనుగుల సతీష్ అనే యువ రైతు తన వ్యవసాయ క్షేత్రంలో సీసీ కెమెరా ఏర్పాటు చేసుకున్నాడు. ఈ సీసీ కెమెరా విద్యుత్‌తో సంబంధం లేకుండా సోలార్‌సిస్టంతో పనిచేస్తుంది. దీని కోసం రైతు ఎనిమిది వేల రూపాయలు ఖర్చు చేశాడు. పొలంలో సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగల నుంచి, అడవి పందుల నుంచి పంట ఉత్పత్తులను కాపాడుకోవచ్చని రైతు సతీష్ తెలిపాడు.

రోస్టర్ విధానంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు అన్యాయం

ఇల్లంతకుంట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) రోస్టర్ విధానంలో ఎస్సీఎస్టీ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని పేర్కొంటు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నికోలస్‌కు బహుజన టీచర్స్‌ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. హైద్రాబాద్‌లో శనివారం కలిసి సమస్యలు విన్నవించారు. ఉపాధ్యాయుల పదోన్నతులలో ప్రస్తుతం అనుసరిస్తున్న విధానం సరిగా లేదన్నారు. పాఠశాలల పర్యవేక్షణకు జిల్లాస్థాయిలో సబ్జెక్ట్ నిపుణులను నియమించాలని, అప్పుడే మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉందన్నారు, అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో బీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎలా కిషన్, సంఘనాయకులు జాడి రాజన్న, జాదవ్ వెంకట్రావునాయక్, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

- ఐదు రోజులుగా సమ్మెలో కార్మికులు
- వంటావార్పుతో వినూత్న నిరసన..
- యజమానులతో చర్చలు విఫలం

టెక్స్‌టైల్ పార్క్ సమ్మె ఉధృతం



ప్రధాన ద్వారం ఎదుట కార్మికులు వంటావార్పు



టెక్స్‌టైల్ పార్కు ప్రధాన ద్వారం

తంగళ్లపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల సాధన కోసం టెక్స్‌టైల్ పార్కు పవర్ లూం కార్మికులు సమ్మె ఉధృతం చేశారు. ఐదు రోజులుగా కార్మికులు సమ్మెబాట పట్టి ఆందోళన చేస్తున్నారు. దీంట్లో భాగంగా శనివారం తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి టెక్స్‌టైల్ పార్కు ప్రధాన ద్వారం ముందు కార్మికులు వంటావార్పుతో నిరసన వ్యక్తం చేశారు. కొద్ది రోజులుగా టెక్స్‌టైల్ పార్కు కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నారు. గతంలో యజమానులు, చేనేత జౌళి శాఖ అధికారులకు కూలి పెంపు తదితర సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు సమర్పించారు. యజమానులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఒక్కరోజు సమ్మె చేశారు. అయినా యజమానులు, అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో నిరవధిక సమ్మెకు దిగుతామని ప్రకటించారు. కార్మికుల సమ్మె నోటీసును అధికారులు, యజమానులు పట్టించుకోకపోవడంతో ఈనెల 19వ తేది నుంచి కార్మికులు నిరవధిక సమ్మెకు దిగారు.

● ప్రధానంగా డిమాండ్లు..

కార్మికులు ప్రధానంగా మూడు డిమాండ్లతో సమ్మె బాట పట్టారు. టెక్స్‌టైల్ పార్కులో ప్రభుత్వ ఆర్డర్ వస్త్రాలకు సంబంధించి కార్మికులకు రోజుకు రూ.1000 వేతనం వచ్చే విధంగా కూలి నిర్ణయించి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రైవేట్ వస్త్రాలకు 10 పిక్కులకు 50 పైసలు కూలీ పెంచి అందివ్వాలని, కార్మికులకు ప్రతి సంవత్సరం 15 రోజుల వేతనం బోనస్‌గా అందించాలనే డిమాండ్లతో సమ్మె బాట పట్టారు.

● చర్చలు విఫలం..



యజమానులతో చర్చలు జరుపుతున్న కార్మికులు

కూలీ పెంపు విషయంపై నిన్న అధికారులతో జరిగిన చర్చలు.. నేడు యజమానులతో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. కార్మికుల సమ్మెబాట పట్టడంతో చేనేత జౌళి శాఖ అధికారులు శుక్రవారం కార్మికులతో చర్చలు జరిపారు. ముందుగా సమ్మె విరమించాలని వారం రోజుల్లో కూలి పెంచే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పడాన్ని తిరస్కరించి సమ్మె కొనసాగించారు. కార్మికులు, యజమానులను సమన్వయం చేసి శనివారం చర్చలు జరిపించింది. అధికారులు వారం రోజులు గడువు అడిగిన విధంగానే యజమానులు సైతం అదే విధంగా ముందుగా సమ్మె విరమిస్తే వారం రోజుల్లోగా కూలి పెంపు విషయంపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీంతో కార్మిక సంఘ నాయకులు, కార్మికులు సమ్మె విరమించేది లేదని ముందుగా కూలీ పెంపుపై హామీ ఇస్తేనే సమ్మె విరమిస్తామని తేల్చి చెప్పారు. రెండు రోజుల్లో రెండుసార్లు జరిగిన చర్చలు విఫలమయ్యాయి.

● ఐదు రోజులుగా సమ్మె..

కార్మికులు ఐదు రోజులుగా సమ్మె బాట పట్టి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 19, 20వ తేదిన టెక్స్‌టైల్ పార్కులో ర్యాలీ నిర్వహించి ప్రధాన ద్వారం వద్ద ధర్నా నిర్వహించారు. 21వ తేదిన జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి నేతన్న విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 22వ తేదిన ఏడీ కార్యాలయం ఎదుట ధర్నా చేసి అధికారులకు వినతి పత్రం సమర్పించారు. శనివారం టెక్స్‌టైల్ ప్రధాన ద్వారం ఎదుట వంటావార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్మికులకు మద్దతుగా సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్రఅధ్యక్షుడు మూషం రమేశ్, జిల్లా అధ్యక్షులుకోడంరమణలుఆందోళనలో పాల్గొన్నారు.

కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు..

- కోడం రమణ, తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు



టెక్స్‌టైల్ పార్కులో కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. ప్రభుత్వ స్పందించి కార్మికులకు కూలి పెంచి న్యాయం చేయాలి. కార్మికుల ఉపాధి కోసం ప్రభుత్వం ఆర్డర్లు ఇస్తోంది. దానికి అనుగుణంగా కార్మికులకు కనీసం రోజుకు రూ.1000 వేతనం అందే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్ వస్త్రానికి 10 పిక్కులకు కనీసం 50పైసలు పెంచాలి. అధికారులు, పాలకులు తక్షణమే చర్యలు చేపట్టాలి.

కూలి పెంచాలి..

- ఆకుబత్తిని శ్రీకాంత్, టెక్స్‌టైల్ పార్కు కార్మికుడు



కూలి ఒప్పందం ముగిసి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు కూలి పెంపు ఊసే ఎత్తడంలేదు. ధరలకు అనుగుణంగా కూలి పెంచాలి. అధికారులు స్పందించి కూలి పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతుండగా కూలి మాత్రం పెరగడం లేదు.

కార్మికులతో చర్చలు జరుపుతున్నాం..

-రాఘవరావు, ఏడీ టెక్స్‌టైల్ పార్కు

సమ్మె విరమణకు కార్మికులతో చర్చలు జరుపుతున్నాం. రెండుసార్లు జరపగా విఫలమయ్యాయి. శనివారం యజమానులు, కార్మికులను సమన్వయం చేసి చర్చలు జరిపించాం. సానుకులంగా చర్చలు జరిగినప్పటికి చివరికి విఫలయ్యాయి. కార్మికుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలో సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

తండ్రి ఏఎస్ఐ.. కొడుకు ఎస్ఐ

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా రాజయ్య విధులు నిర్వహిస్తున్నారు. గంబీరావుపేట ఎస్ఐగా పనిచేస్తున్న రాజయ్య తనయుడు రమాకాంత్ ఎస్ఐగా శనివారం బదిలీపై బోయినపల్లికి వచ్చారు. ఉమ్మడి జిల్లాలోని మానకొండూరు మండలం వేగురుపల్లికి చెందిన రమాకాంత్ 2018లో ఎస్ఐగా ఎంపికయ్యారు. తండ్రి విధులు నిర్వహిస్తున్న పోలీస్ స్టేషన్‌కే తనయుడు ఎస్ఐగా రావడంతో వారిలో ఆనందం వెల్లివిరుస్తోంది.

ఎమ్మెల్యే కవ్వంపల్లికి పరామర్శ



ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను పరామర్శిస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను, కుటుంబ సభ్యులను రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి శనివారం పరామర్శించారు. ఎమ్మెల్యే సోదరుడు కవ్వంపల్లి రాజేశం ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న మంత్రి వివేక్ వెంకటస్వామి కరీంనగర్‌లో ఎమ్మెల్యేను కలిశారు. బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కొమ్మెర రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



కొండగట్టులో క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. శ్రావణ మాసం చివరి రోజు అమావాస్య సందర్భంగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. రాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి చేరుకున్న భక్తులు రాజన్నను దర్శించుకుని తరించారు. రాజన్నకు ఎంతో ఇష్టమైన కోడెమొక్కులు చెల్లించుకున్నారు. కాగా ఈనెల 27వ తేదిన రాజన్న ఆలయంలోని నాగిరెడ్డి మండపంలో వినాయక విగ్రహాన్ని నిలిపేందుకు ఆలయాధికారులు ఏర్పాట్లు చేశారు.

అంజన్న సన్నిధిలో..

మల్యాల: మండలంలోని కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు అంజన్న సన్నిధికి వచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు ఇతరాత్ర పూజలు నిర్వహించి బేతాళుడు, రాములవారిని కూడా దర్శించుకున్నారు. స్వామి వారికి ఆలయ అర్చకులు చందనాభిషేకం, నిత్య పూజలు జరిపారు.

● ధర్మపురి క్షేత్రంలో..

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. స్థానిక లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ ఆలయాల్లో ఉదయం ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించి ఆలయాలకు చేరుకుని అభిషేకం, అర్చన, హోమం, నిత్య కల్యాణం చేయించారు. స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

మైనార్టీ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు

తిమ్మాపూర్/కరీంనగర్ రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న తెలంగాణ మైనార్టీస్ గురుకుల కళాశాల(బాలుర), కరీంనగర్ విట్స్ క్యాంపస్, రేకుర్తిలో గల తెలంగాణ మైనార్టీస్ గురుకుల కళాశాల (బాలికల)లో ఈ విద్య సంవత్సరం 2025-2026 నుంచి ఐఐటీ, నీట్ కోర్సులకు ఉచిత శిక్షణతో ప్రత్యేక తరగతులు ప్రారం భం అవుతున్నాయని మైనార్టీ గురుకులాల సమన్వయకర్త కె సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మైనార్టీస్(ముస్లిం, జైనులు, బుద్ధులు, సిక్కులు, పార్సీలు) నాన్ మైనార్టీస్(ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ)ల నుంచి ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు 26వ తేదీ లోపు సమర్పించాలని, ఈ నెల 29న ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు విట్స్ క్యాంపస్‌లోని ఆర్ఎల్‌సీ కార్యాల యంలో, ఇతర వివరాలకు 7331170869, 7331170843, 7033117844 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ ప్రవేశాల గడువు పొడిగింపు

గణేశ్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2025-26 విద్యా సంవత్సరానికి ఓపెన్ డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు ఈనెల 30 వ తేదీ వరకు గడువు ఉందని ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వరలక్ష్మి, కోఆర్డినేటర్ డాక్టర్ మనోజ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్, ఐటీఐ, డిప్లొమా విద్యార్థులు టీఎస్ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసి రశీదు పొందాలని సూచించారు. ఇతర సమాచారం కోసం 7382929755 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఒక్క ఎకరాలకు అదనంగా నీరిచ్చినా ముక్కుకు నేలకు రాస్తా..

- బీఆర్ఎస్ నాయకులకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో చొప్పదండి నియోజకవర్గానికి ఒక్క ఎకరానికి అదనంగా నీరిచ్చినట్లు నిరూపిస్తే తన ముక్కు నేలకు రాస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బీఆర్ఎస్ నాయకులకు సవాలు విసిరారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే జనహిత పాదయాత్రతో ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ పీఠం కదులుతుందన్నారు. గంగాధర మండలంలో జన సునామి రాబోతోందన్నారు. పదేళ్లలో పేదలకు బీఆర్ఎస్ ఒక్క ఇంటినీ నిర్మించి ఇవ్వలేదని, ఇప్పుడు నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేశామని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్నవారందరికీ అందిస్తున్నామని అన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో పదేళ్లలో ఒక్కపనీ చేయలేదన్నారు. నియోజకవర్గానికి నీరివ్వకుండా ఎండబెట్టి గాయత్రి పంపుహౌస్ ద్వారా సిరిసిల్ల, గజ్వేల్ నియోజకవర్గాల్లో పారించు కున్నారని విమర్శించారు. నియోజకర్గంలో అదనంగా ఒక్క ఎకరాకు నీరిచ్చినట్లు నిరూపించినా ముక్కుకు నేలకు రాస్తానని ఎమ్మెల్యే సవాలు విసిరారు. బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు చిల్లరగాళ్లకు డబ్బులు ఇచ్చి న్యూసెన్స్ చేయాలని చూస్తున్నారని, నాలుక చీరేస్తామని హెచ్చరించారు. కేసీఆర్ కొండగట్టుకు రెండుసార్లు వచ్చి రూ.500 కోట్లు ఇస్తామన్నారని, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని అన్నారు. నియోజకవర్గానికి ఒక్క ప్రాజెక్టు, పరిశ్రమ, విద్యాసంస్థకానీ తీసుకురాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో త్వరలోనే గంగాధరలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో చొప్పదండి నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. జనహిత పాదయాత్రలో అన్నివర్గాలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఎరువులపై మూడు జిల్లాల కలెక్టర్లతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నామని, కొందరు కావాలని కృత్రిమ కొరత సృష్టించే యత్నం చేస్తున్నారని విమర్శించారు. నారాయణపూర్ ప్రాజెక్టు భూసేకరణకు త్వరలోనే రూ.43 కోట్లు మంజూరవుతాయన్నారు. గంగాధర మండలం ఉప్పర మల్యాల నుంచి కురిక్యాల ద్వారా మధురానగర్ ఎక్స్ రోడ్ వరకు పాదయాత్ర సాగుతుందని, అక్కడే సభ ఉంటుందని తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు హాజరుకానున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్, టీపీసీసీ నాయకులు రుద్ర సంతోష్, రహమత్ హుస్సేన్, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్, పులి అంజనేయులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ నిర్వాసితుల త్యాగం మరువలేనిది

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల త్యాగం ఎప్పటికీ మరువలేనిదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యలయంలో శనివారం కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలవాగు నుంచి రాజన్న ఆలయం వరకు రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేపట్టనున్నామని తెలిపారు. పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. అభివృద్ధిలో అందరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంద్రగిరి శ్రీనివాస్, సాగరం వెంకటస్వామి, కనికరపు రాకేష్, పుల్కం రాజు, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.


గోదావరిలోకి కొనసాగుతున్న నీటి విడుదల

- ఎస్సారెస్పీ 16 గేట్ల నుంచి ...

49,280 క్యూసెక్కులు దిగువకు







గేట్ల ద్వారా దిగువకు ఉరకలేస్తున్న శ్రీరాంసాగర్ నీరు, గాయత్రి పంపుహౌస్ నుంచి విడుదలవుతున్న నీరు, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి విడుదల అవుతున్న నీరు

జగిత్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల శనివారం కొనసాగింది. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు ఎక్కువగా వస్తుండడంతో 16 గేట్ల ద్వారా 49,280 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. కాగా ఎస్సారెస్పీలోకి 75 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 79.263 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద గేట్లు పైకి ఎత్తడం, కాకతీయ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 78,812 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 20,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 3,500 క్యూసెక్కులు వదులుతున్నారు.

శ్రీపాద ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద

అంతర్గాం: జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద కొనసాగుతున్నది. శుక్రవారం సాయంత్రం వరకు వరద తగ్గుముఖం పట్టడంతో గేట్లు మూసేసిన అధికారులు వరద పెరగడంతో మళ్లీ శనివారం గేట్లు తెరిచారు. ఎగువ ప్రాంతం నుంచి 86,775 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, గోదావరిలోకి 10 గేట్ల, ద్వారా 80200 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. నంది పంప్‌హౌస్‌కు 6300 క్యూసెక్కుల నీటిని తరలిస్తుండగా, అక్కడి నుంచి గాయత్రి పంప్‌హౌస్ ద్వారా మిడ్ మానేరులోకి 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, 19.730 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

గాయత్రి పంపుహౌస్ నుంచి..

రామడుగు: రామడుగు మండలం గాయత్రి లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి నీటి విడుదల కొనసాగుతుంది. ప్రస్తుతం రెండు పంపుల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని అధికారులు గ్రావిటీ కెనాల్ ద్వారా విడుదల చేశారు. అది నేరుగా వెళ్లి వరద కాలువలో కలుస్తుంది. ఎస్సారెస్పీ నుంచి 16,000 క్యూసెక్కుల నీరు వరద కాలువ 99 కిలోమీటర్ల వద్ద కలుస్తున్నాయి. దీంతో ప్రస్తుతం వరద కాలువకు 22,600 క్యూసెక్కుల నీరు చేరుతున్నది. మిడ్ మానేరుకు 22,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ద్వారా నీటి ప్రవాహం కొనసాగు తోంది. ప్రాజెక్టులోకి శనివారం సాయంత్రం వరకు 21,368 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతుంది. ఇందులో ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 15,068, గాయత్రి పంప్‌హౌస్ నుంచి 6,300 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. మిడ్ మానేరు ప్రాజెక్టు నుంచి ప్యాకేజి 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 9600, ఎల్ఎండీ ప్రాజెక్టుకు నాలుగు గేట్లను మీటరుపై కెత్తి 8,018 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు గాను ప్రస్తుతం 313.79 నీటినిల్వ సామర్థ్యం 27.55 టీఎంసీలకు గాను 17.936 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి..


ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి మూడు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.31 టీంసీలకు చేరుకుంది. మధ్యమానేరు ద్వారా 9600 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఎగువన ఉన్న 11వ ప్యాకేజీలోని రంగనాయకసాగర్‌కు 6600 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

ఎనిమిది టీఎంసీలకు చేరిన దిగువ మానేరు

తిమ్మాపూర్: కరీంనగర్ పరిధిలోని ఎల్ఎండీ రిజర్వాయర్ నీటి మట్టం ఎనిమిది టీఎంసీలకు చేరుకుంది. ఎగువన ఉన్న శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ (మధ్య మానేరు) రిజర్వాయర్ నుంచి నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఎగువ నుంచి క్యూసెక్కుల నీరు మొత్తం 12,262 క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటిమట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.261 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఉధృతంగా వరద కాలువ

గంగాధర: వరద కాలువలో శ్రీరాంసాగర్ నీరు ప్రమాదకరంగా ఉధృతంగా ప్రవహిస్తోంది. పదిహేనేళ్లలో ఎన్నడు ఇంతటి వరద ప్రవాహం చూడలేదని రైతులు అంటున్నారు. గంగాధర మండలంలోని ర్యాలపల్లి, కొండయ్యపల్లి, నాగిరెడ్డిపూర్, కొండన్నపల్లి, తాడిజెర్రి, రంగరావుపల్లి, గర్షకుర్తి, గట్టుబూత్కూర్, ఆచంపల్లి గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ పంపు మోటార్లు, స్టార్టర్లు వరద ఉధృతికి కొట్టుకుపోయినట్లు తెలిపారు. అధికారులు ఇంతపెద్ద ఎత్తున నీరు విడుదల చేస్తున్నట్లు కనీస సమాచారం అందించలేదని రైతులు వాపోతున్నారు. ఇక లక్ష్మీపూర్ గాయత్రీ పంపుల్లో రెండు మోటర్ల ద్వారా ఆరు వేలు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 19,000 క్యూసెక్కులు మొత్తం 25,000 క్యూసెక్కుల నీరును వరద కాలువ నుంచి మిడ్ మానేరుకు తరలిస్తున్నారు. నాగిరెడ్డిపూర్ గేట్ల వద్ద నీటిపారుదల శాఖ ఎస్ఈ రమేష్, డీఈ రూప్లా నాయక్, ఏఈ రఘురాంలు వరద కాలువ నీటిని శనివారం పర్యవేక్షించారు.



ఎల్ఎండీలో ఉన్న నిల్వ ఉన్న నీరు

జాతీయ అంతరిక్ష దినోత్సవం

జగిత్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్)లో శనివారం భౌతిక శాస్త్రం, కంప్యూటర్ సైన్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో 2వ జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించారు.

మందుబాబుల వీరంగం

జగిత్యాల క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):జగిత్యాల జిల్లా కేంద్రంలోని 10వ వార్డు లింగంపేటలో శుక్రవారం అర్ధరాత్రి మందు బాబులు వీరంగం సృష్టించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కొడిమ్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వర్షా కాలంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాలని జిల్లా ఉప వైద్యాధికారి ఎన్. శ్రీనివాస్ కోరా రు. శనివారం తిప్పయ్యపల్లిలో తనిఖీ చేశారు.

నియామకం

రాయికల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండల స్వర్ణకార సంఘం అధ్య క్షునిగా సంజీవ చారి ఏకగ్రీవంగా ఎన్నిక య్యాడు. ప్రధాన కార్యదర్శిగా తొగిటి గోపి, ఉపాధ్యక్షులుగా సాగర్, చారి, కోశాధికారిగా పొలాస సింహాచారి ఎన్నికయ్యారు.

సమస్యలు పరిష్కరించాలి

సారంగాపూర్, ఆగస్టు, 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్య క్షులు జగదీష్, శివకుమార్ పాల్గొన్నారు.

భీమారం మండలవాసికి డాక్టరేట్

భీమారం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలంలోని దేశాయిపేట గ్రామానికి చెందిన నాగుల నరేష్ ఉస్మాని యా యూనివర్సిటీ నుంచి ఇంగ్లీష్ విభాగం లో డాక్టరేట్‌ను అందుకున్నాడు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

రాయికల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గట్టు రమేష్ నర్సయ్య విద్యార్థులకు అవగా హన కల్పిస్తూ దాదాపు 62 మంది విద్యా ర్థులను పాఠశాలలో చేర్పించారు. ఆదర్శంగా నిలిచిన ప్రధానోపాధ్యాయుడిని శనివారం రాయికల్‌లో సెక్టోరియల్ సమావే శంలో ఘనంగా సన్మానించి, రూ.10 వేల పారితోషికం అందించారు.

యూరియాను మోతాదులో వాడాలి

కొడిమ్యాల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : రైతులు యూరియాను తగిన మోతాదులో వినియోగించాలని రైతు విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ హరికృష్ణ అన్నారు. శనివారం మండలంలోని రామకిష్టాపూర్ గ్రామంలో అవగాహన కల్పించారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ

మల్యాల: రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ చాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో తాటిపల్లి బాలికల గురుకులం విద్యార్థినిలు ప్రతిభ చాటారు. జూనియర్ అథ్లెటిక్స్‌లో బి.కీర్తన, ఏ.హాసిత, బి.హారిక బంగారు పతకాలు, జరాఫతీమా బంగారు, వెండి పతకాలు, మేఘన, ఏ.జస్మిక, వెండి పతకాలు, సంజన, సిరి కాంస్య పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ మానస తెలిపారు.

ఎస్సారెస్పీ కాలువ మొరం అక్రమ రవాణా

-నిబంధనలకు విరుద్ధంగా వేలం నిర్వహించినా పట్టించుకోని అధికారులు


కాలువ దగ్గర మొరం తీసిన స్థలం

కోరుట్ల రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలంలో ఎస్సారెస్పీ కాలువ మొరం ఎక్స్‌కావేటర్ల సహాయంతో టిప్పర్లలో విచ్చలవిడిగా తరలిస్తున్నా పోలీసులు, రెవెన్యూ, భూగర్భ శాఖ అధికారులు చోద్యం చేస్తున్నారన్న ఆరోపణలు వెలువెత్తు తున్నాయి. సంగెం గ్రామశివారులో ఉన్న మొరం తరలింపు కోసం గ్రామ వీడీసీ సభ్యులు వేలం వేసి అక్రమ తరలింపునకు స్వీకారం చుట్టడం మండలంలో చర్చనీయాశంగా మారింది. మండలంలోని ఎఖీన్‌పూర్ గ్రామ శివారు నుంచి గుమ్లాపూర్ గ్రామ శివారు వరకు ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ నిర్మాణం చేపట్టి దానికి ఇరువైపులా కాల్వ మొరం నింపారు. కాలువకు ఇరువైపులా ఉన్న మొరాన్ని కొందరు అక్రమార్కులు కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో అవసరం ఉన్నవారి టిప్పర్‌కు రూ.6వేలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. 15 కిలోమీటర్ల మేర కాలువ ఉండడంతో అక్కమార్కులు ఎక్స్‌కావేటర్ల సహాయంతో టిప్పర్లలో నింపుకొని జేబుల్లో డబ్బులు నింపుకుంటున్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనుల పేరిట సంబంధిత అధికారుల వద్ద తరలింపు కోసం ఒకటి రెండు ట్రిప్పుల అనుమతిని పొంది పదుల సంఖ్యలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే ఎఖీన్‌పూర్, గుమ్లాపూర్ గ్రామల వద్ద ఉన్న మొరాన్ని సగం వరకు అక్రమాలు తరలించారు. సంగెం గ్రామశివారులో ఉన్న మొరంపై అక్రమార్కుల కన్ను పడడంతో గమనించి గ్రామ వీడీసీ సభ్యులు వేలం పాటకు ఉపక్రమించారు. వేలంలో రూ.20 లక్షలకు ఓ వ్యక్తి దక్కించుకున్నట్లు సమాచారం. అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

●ఆక్రమాలకు గురవుతున్న కాలువ భూములు

ఎస్సారెస్పీ ప్రధాన కాలువ భూమి అన్యాక్రాతం అవుతున్నా అధికారులు స్పందించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎఖీన్‌పూర్ నుంచి గుమ్లాపూర్ గ్రామ శివారు వరకు కాల్వకు ఇరువైపులా ఉన్న మొరంను అక్రమార్కులు అక్రమంగా తలిస్తుండగా కొందరు ఆ భూమిని చదును చేసి సాగు చేస్తున్నారు. గతంలో కాలువ ప్రాంతంలో ఎస్సారెస్పీ అధికారులు పర్యవేక్షణ నిర్వహిస్తు మొరంతో పాటు భూమి పరిరక్షణకు చర్యలు చేపట్టేవారు. ప్రస్తుతం అధికారుల పర్యవేక్షణ లేకపో వడంతో అక్రమార్కులు ఇష్టారా జ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని మొరంతో పాటు భూమిని పరిరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

మట్టి తరలింపుపై విచారణ చేస్తున్నాం

-కృష్ణచైతన్య, తహసీల్దార్

సంగెం గ్రామంలో మొలం తరలింపు కోసం వేలం పాట నిర్వహించారన్న విషయంపై విచారణ చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.



జరుగుతున్నప్పటికీ నిధులకొరత వల్ల అభివృద్ధి కార్య క్రమా లు ముందుకు సాగడం లేదు. ఈనెల 22న ప్రభుత్వం చేపట్టిన పనుల జాతరతో పల్లెల్లో నూతన పనులు ప్రారంభమై పాలన మరింత మెరుపడనుంది. ఓ వైపు అభివృద్ధి పనులే కాకుండా వ్యక్తిగతంగా ఉపాధిహామీ కూలీలకు ఉపాధి దొరకనుంది.

గ్రామీణ ప్రజల ఉపాధి కోసమే..

-ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

గ్రామీణప్రజల జీవనోపాధిని పెంచడానికి ప్రభుత్వం పంచా యతీరాజ్, గ్రామీణా భివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథ కం పనుల జాతర కార్యక్రమం నిర్వహి స్తోంది. పనుల జాతర కింద కోట్ల నిధులు వెచ్చించి వేల సంఖ్యలో పలు పనులు చేపడుతున్నాం. పల్లె జాతరను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.



ప్రభుత్వ లక్ష్యం మేరకు పూర్తి చేస్తాం..

-మదన్‌మోహన్, ఈజీఎస్ ఏపీడీ

ప్రభుత్వ లక్ష్యం మేరకు ఈజీఎస్ కింద పనులను పూర్తిచేస్తాం. పనుల జాతర కార్యక్రమాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా రూ.39.11 కోట్లతో 3,591 పనులు పూర్తి చేయాలని నిర్ణయించాం. అన్ని వర్గాల భాగస్వామ్యంతో లక్ష్యం సాధిస్తాం.

విద్యుత్ తీగల్లో ఇరుక్కున్న వినాయక విగ్రహం

-స్థానికుల అప్రమత్తతతో తప్పిన పెనుప్రమాదం


కోరుట్లలో విద్యుత్ తీగల్లో ఇరుకున్న గణనాథుడు

కోరుట్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో నవరాత్రి ఉత్సవాల కోసం తరలిస్తున్న వినాయక విగ్రహం శనివారం విద్యుత్ తీగల మధ్య ఇరుక్కుపోయింది. కోరుట్ల నుంచి చందుర్తి మండలం మల్యాల గ్రామానికి ప్రత్యేక వాహనం ద్వారా తరలిస్తుండగా మార్గమధ్యలో విద్యుత్ తీగలో ఇరుక్కుపోయింది. దీంతో విద్యుత్ సిబ్బంది అక్కడకు చేరుకొని సరఫరాను నిలిపి వేసి విగ్రహాన్ని తీగల నుంచి బయటకు వచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. వారం రోజుల నుంచి పట్టణంలో భారీ విగ్రహాల తరలింపుతో అక్కడక్కడ ఇదే సమస్య తలెత్తడంతో విద్యుత్ సిబ్బంది నానాతంటాలు పడుతున్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

●డీఆర్డీవో రఘువరణ్


మాట్లాడుతున్న డీఆర్డీవో రఘువరణ్

కొడిమ్యాల, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేయాలని డీర్డీవో రఘువరణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో శ్రీ ధరణి వ్యవసాయ ఉత్పత్తి దారుల పరస్పర సహకార సంఘం ఆరోవ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్డీవో మాట్లాడుతూ చిన్న సన్నకారు రైతులు తాము పండించిన పంటలను గిట్టుబాటు ధరలకు అమ్ముకోవాలన్నారు. శ్రమకోర్చి పండించిన పంటలను దళారులకు అమ్ముకొని నష్టాలపాలు కావద్దన్నారు. ఈ సమావేశంలో ఉత్పత్తిదారుల సహకార సంఘం పాలక వర్గ సభ్యులు, మండల సమాఖ్య అధ్యక్షురాలు పద్మ, ఏపీఎంలు నాన్‌ఫాం హుస్సేన్, మల్లేశం, మేనెజర్ శ్రీధర్, సీసీలు వీరకుమార్, మంగ, స్వరూప, పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి

రాయికల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం మైతాపూర్, రాయికల్-రామాజీపేట గ్రామాల మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని రాయికల్ మండల బీజేపీ నాయకులు శనివారం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఆకుల మహేష్, పట్టణ అధ్యక్షుడు కుర్మ మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి బండారి సాయిరాజ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ రాజనాల మధు, జిల్లా కార్యవర్గ సభ్యులు తొగిటి లక్ష్మీనారాయణ, ఉపాధ్య క్షులు రవీందర్, సంకోజి మహేష్, వట్టిమల్ల శ్రీను, కార్యదర్శులు సత్తన్న, వేణు, కోశాధికారి చింత రాజేష్, నాయకులు రవీందర్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

బీర్‌పూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన గుమ్మ డి శంకరయ్య శుక్రవారం రాత్రి మృతి చెందాడు విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మృతుడు శంక రయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందిన పూడూరి రాజయ్య ఇటీవల గుండెపోటుతో మరణించాడని తెలిసిన ఆయన మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశాడు ఈ కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావ్, నాయకులు నారపాక రమేష్, మహిపాల్ రెడ్డి, హరీష్, నరేందర్, కృష్ణరావ్, శీలం రమేష్, రవి, శ్రీనివాస్, మారుతి, గంగాధర్, రాజేశం తదితరులు ఉన్నారు.

ఘనంగా పొలాల అమావాస్య

ధర్మపురి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలో పొలాల అమవాస్య వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అనేక గ్రామాల్లో రైతులు పశువులను శుభ్రంగా కడిగి కాళ్ల, చేతులు, కొమ్ములను రంగులతో అలంకరించారు.

●మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శనివారం పొలాల అమావాస్య వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమ ఇండ్లలో పసుపుతో గౌరమ్మను తయారు చేసుకొని ప్రత్యేక పూజలు జరిపారు. వివిధ రకాల వంటకాలను, తీపి పదార్థాలను వండి అమ్మ వారికి నైవేద్యంగా సమర్పించారు.

ఉత్తమ ఎస్‌హెచ్‌వోగా మల్యాల ఎస్సై

మల్యాల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్ అన్ని విభాగాల్లో జిల్లాలోనే ఉత్తమ ఎస్‌హెచ్‌వోగా మల్యాల ఎస్సై ఏ.నరేశ్‌కుమార్ నిలువగా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు. శనివారం జరిగిన జిల్లా స్థాయి నేరసమీక్ష సమావేశంలో ఎస్సై నరేశ్‌కుమార్‌కు ప్రశంసాపత్రం అందించారు. అనంతరం డీఎస్పీ రఘుచరణ్, మల్యాల సీఐ నీలం రవి, పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఎస్సైని అభినందించి సత్కరించారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పాఠశాలలో, అంగన్‌వాడీ సెంటర్‌లలో పిల్లలను చేర్పించాలని జగిత్యాల పట్టణంలోని నూకపెల్లి అర్బన్ కాలనీ కమిటీ సభ్యులు శనివారం ఇంటింటికీ తిరిగి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అర్బన్ కాలనీ కమిటీ అధ్యక్షులు ఖలీల్, బొల్లారపు స్వామి, కంటె విజయ, అక్మల్ ఉన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

రాయికల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒడ్డెలింగాపూర్ గురుకుల పాఠశాలలో శనివారం మండల వైద్యాధికారి కస్తూరి సతీష్ కుమార్ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 14 మంది విద్యార్థులకు మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకునే జాగ్రత్తలను, చేతులు శుభ్రం చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీలత, సీహెచ్‌వో సాగర్ రావు, సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఫార్మాసిస్ట్ దీపిక, ఏఎన్ఎం అఖిల పాల్గొన్నారు.

యూరియా కొరత తీర్చాలి

-బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): రైతుల యూరియా కష్టాలు తీర్చాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుతం రైతులకు పంటలకు సరిపోయే యూరియా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ప్రణాళిక బద్ధంగా వ్యవసాయన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. రైతుల ఆవేదనను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం యూరియా కొరత లేకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

పోచమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురాణీ పేటలో ఉన్న శ్రీ లోకమాత పోచమ్మ తల్లి ఆలయ 63వ వార్షికోత్సవం శనివారం ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గాజుల రాజేందర్, రాజగోపాల చారి, రాఘవ చారి, గంగాధర్, చంద్ర ప్రకాష్, మునీందర్, హరికృష్ణ, సత్యజిత్, ప్రవీణ్, భద్రయ్య తదితరులు ఉన్నారు. అలాగే చింతకుంట చెరువు సమీపంలో ఉన్న గుండు ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌తో పాటు మాజీ కౌన్సిలర్లు ఉన్నారు.

ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

-వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ

జగిత్యాల అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని గొల్లపల్లి రోడ్డులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాయికల్‌కు చెందిన బైరి లక్ష్మణ్ అనే వ్యక్తి శనివారం మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని మృతుడి బంధవులు ఆరోపించారు. మృతుడి బంధువుల కథనం ప్రకారం లక్ష్మణ్ 18న గుండెనొప్పితో ఆసుపత్రిలో చేరాడు. అయితే ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయాలని బంధువులు సూచించడంతో అప్రూవల్ కోసం 19న దరఖాస్తు చేయగా 21వ అనుమతి వచ్చింది. అయితే శనివారం లక్ష్మణ్‌ను ఆపరేషన్ చేయడానికి తీసుకువెళ్ళగా అతను మృతి చెందడంతో వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆరోపించారు. ఆసుపత్రి వైద్యుడిని వివరణ కోరగా లక్ష్మణ్‌కు ఆపరేషన్ చేయడానికి థియేటర్‌లోకి తీసుకు వెళ్ళగానే మరోసారి గుండె నొప్పి వచ్చిందని, అతనిని బతికించడానికి ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు.

హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే

మల్యాల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మల్యాల అంగడిబజారులో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శనివారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. గ్రామ పంచాయితీ ఈవో శ్రీకాంత్, నాయకులు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ముత్యం శంకర్, నాగభూషణం, బట్టు విజయ్, తిరుపతి, లక్ష్మన్, లక్ష్మణాచారి, వినయ్, హన్మంతు, వంశీ, అనిల్, రామాంజనేయులు, బండి రవి, బాలే శ్రీనివాస్ పాల్గొన్నారు.

అలరించిన ఫ్రెషర్స్‌డే వేడుకలు

కోరుట్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పీఆర్‌బీఎం జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు అలరించాయి. శనివారం పట్టణంలోని పీబీ పంక్షన్ హాల్‌లో పీఆర్‌బీఎం కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో స్వాగతోత్సవ కార్యక్రమాన్ని విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలతో ఆ ప్రాంతం ఉర్రూతలూగింది. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాల కరస్పాండెంట్లు, ప్రిన్సిపల్స్ బారీ, వెంకటేష్, దీపక్, సత్యనారాయణ, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కోరుట్ల సీఐ

కోరుట్ల రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను కోరుట్ల సీఐ సురేష్ బాబు తన వాహనంలో కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటు కున్నాడు. శనివారం రుద్రంగి మండలం కేంద్రానికి చెందిన మర్రిపల్లి సాగర్ - మాధవి దంపతులు తమ పిల్లలు అర్జున్, జశ్వంత్‌లతో కలిసి ద్విచక్ర వాహనంపై జగిత్యాలలో జరిగిన శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా వెంకటాపూర్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. సీఐ సురేష్ బాబు జగిత్యాల నుంచి కోరుట్లకు తన వాహనంలో వస్తుండగా ప్రమాదం జరిగిన విష యం తెలుసుకొని క్షతగాత్రులను తన వాహనంలో కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందే వరకు ఉండి మానవత్వం చాటుకున్నారు.

ఓటు హక్కు ప్రాముఖ్యంపై అవగాహన

రాయికల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో శనివారం ఓటు హక్కు వినియోగం, ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరస్పాండెంట్ మిట్టపల్లి మహేష్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ కాకర శ్రీనివాస్ రెడ్డి, హెచ్ఎం రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌కు పదోన్నతి

ధర్మపురి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ నిడిగొండ సత్యనారాయణకు ఈవోగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆయన పదోన్నతి ఆర్డర్ కాపీని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా శనివారం స్వీకరించారు.

మట్టి వినాయకులను పూజిద్దాం

ధర్మపురి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామంలో అరబిందో హైస్కూ ల్ విద్యార్థులు మట్టి వినాయకులను తయారు చేసి వినాయకుడి వేషాధారణతో మట్టి వినాయకులను పూజిద్దాం పర్యావరణం కాపాడుదాం అంటూ శనివారం ర్యాలీ నిర్వహించారు.

కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటే

పెగడపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఉప రాష్ట్రపతి ఎన్నికల వేళ బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇతర కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని బీజేపీ జిల్లా అధికా ర ప్రతినిధి మర్రిపెల్లి సత్యం విమర్శించారు.

నవరాత్రి ఉత్సవాలకు సౌకర్యాలు కల్పించాలి

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి):వినాయక నవరాత్రి ఉత్సవాలకు పట్టణంలో సరైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ శనివారం బీఆర్ఎస్ నాయ కులు కమిషనర్ టి. మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రధాన రహదారుల వెంబడి అక్కడ కక్కడ ఉన్న గుంతలను మట్టితో పూడ్చాలని కోరారు. పెరిగిన చెట్ల కొమ్మలను కట్ చేయాలన్నారు.

రాష్ట్రంలో సీపీఎస్‌ను రద్దు చేయాలి


తహసీల్దార్ రాంమోహన్‌కు వినతిపత్రం ఇస్తున్న తపస్ నాయకులు

జగిత్యాలరూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ రద్దుచేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్‌రావు, జిల్లా అధ్యక్షుడు భోనగిరి దేవయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జగిత్యాల అర్బన్ తహసీల్దార్ రాంమోహన్, రూరల్ తహసీల్దార్ అరుణ్ కుమార్‌లను కలిసి వినతిపత్రాన్ని అంద జేశారు. ఈకార్యక్రమంలో తపస్ జిల్లా నాయ కులు మహిపాల్‌రెడ్డి, రామకృష్ణ, శ్రీనివాస్ మూర్తి, సాయిని శ్రీనివాస్, దేవరకిండ శ్రీనివాస్, సురేందర్ పాల్గొన్నారు.

●మెట్‌పల్లిటౌన్: ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ శనివారం పట్టణానికి చెందిన ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పిఆర్‌టియు నాయకులు నర్సింగరావు, టిపియుఎస్ నాయకులు నరసింహాచారి, ఎన్ మల్లేషం, లచ్చయ్య, మహేష్, విక్రం పాల్గొన్నారు.

●ధర్మపురి: టీపీయుఎస్ ఆధ్వర్యంలో ధర్మపురి మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో టీపీయుఎస్ జిల్లా బాధ్యులు బండి మహేష్, కాశెట్టి రమేష్, మండల అధ్యక్షులు కాశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

●రాయికల్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకు మహేశ్వర శర్మ, వేముల మధు, మండల శాఖ అధ్యక్షుడు రజనీకాంత్ పాల్గొన్నారు.

●బీర్‌పూర్: పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని తపస్ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయుల సంఘం నాయకులు తహసీల్దార్ సుజాతకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర ఉపాధక్షులు వొడ్నాల రాజశేఖర్ పాల్గొన్నారు.

●కొడిమ్యాల: మండల రెవెన్యూ కార్యాలయంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యా సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు ఏనుగు ఆదిరెడ్డి, నాయకులు రాజగంగయ్య, జిల్లా నాయకులు గోనె శ్రీనివాస్, కళ్యాణ్, మన్మధరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సురేష్, నాగరాజు ఉన్నారు.

●ఇబ్రహీంపట్నం: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ వరప్రసాద్ కి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో టి యు పి ఎస్ మండల శాఖ అధ్యక్షుడు భరత్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రేమ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షురాలు శోభారాణి, రాజేందర్ పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధనకు కృషి చేయాలి

కోరుట్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ అక్షరాస్యత సాదనకై కృషి చేయాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని బాలిక పాఠశాలలో సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే ఉల్లాస్ లక్ష్యం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలతో పాటు పట్టణంలోని పలు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, గ్రామైఖ్య సంఘాల సభ్యులకు శిక్షణకు మండల విద్యాధికారి నరేశం ఆధ్వర్యంలో నిర్వహించగా ఎంపీడీఓ రామకృష్ణ పాల్గోన్ని వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

●ధర్మపురి: ధర్మపురి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ (బాలికల) లో ఉల్లాస్ కార్యక్రమంపై శనివారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ధర్మపురి ఎంపీడీవో పత్తి రవీందర్, ఎంఈవో సీతాలక్ష్మి పాల్గొన్నారు.

●మల్యాల: నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో స్వాతి, ఎంఈవో జయసింహ రావు వీవోఏ, ఉపాధ్యాయులకు సూచించారు. మల్యాలలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

●వెల్గటూర్: ఆధునిక సమాజంలో మనిషి మనగడకు అక్షరాస్యత అత్యంత కీలకమైనదని మండల విద్యాధికారి ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం ఐకేపీ కార్యాలయంలో నవ భారత్ సాక్షరతా కార్యక్రమంలో భాగంగా ఉల్లాస్‌పై ఉపాధ్యాయులు, వీవోఏలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్ర మంలో తహసిల్దార్ శేఖర్ పాల్గొన్నారు.

●బీర్‌పూర్: బీర్‌పూర్ మండలంలోని నర్సింహులపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో శనివారం నవ భారత్ సాక్షరతా కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి ఉల్లాస్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగభూషణం చేతుల మీదుగా పుస్తకాలు పంపిణీ చేశారు.

●పెగడపల్లి: ఉల్లాస్‌తో ప్రతి ఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని పెగడపల్లి మండల విద్యా ధికారి సులోచన పేర్కొన్నారు. శనివారం పెగడపల్లి మండల విద్యావనరుల కేంద్రంలో మండల స్థాయి ఉల్లాస్ సమావేశం నిర్వహించారు.

సేంద్రియ పద్ధతిలో సాగు చేయాలి

జగిత్యాలరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అధిక రసాయనాల వాడ కాన్ని తగ్గించాలని జగిత్యాల ఏఓ వినీల అన్నారు. జగిత్యాల మండలం ధరూర్ గ్రామంలో రైతులకు నానో యూరియా, డీఏపీ యూరియాలపై అవగాన కల్పించారు. కార్యక్రమంలో ఇఫ్కో కంపెనీ జగిత్యాల మేనేజర్ శ్రీధర్, ఏఈఓ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

జగిత్యాలరూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల రూరల్ మండలం లోని లక్ష్మీపూర్ గ్రామంలోని రెడ్డి సంఘం ఆవరణలో మెడికవర్ ఆస్పత్రి డాక్టర్ సాయిచరణ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిం చారు. కార్యక్రమంలో రెడ్డిసంఘం అధ్య క్షుడు రాజిరెడ్డి, జీవన్‌రెడ్డి, ఎస్. జీవన్‌రెడ్డి, పన్నాల తిరుపతిరెడ్డి, మార్కె టింగ్ మేనేజర్ కోట కరుణాకర్, దాసరి చంద్రశేఖర్, మహేష్ పాల్గొన్నారు.

మట్టి గణపతుల తయారీ

రాయికల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల మోడల్ స్కూల్‌లో శనివారం పీఎంశ్రీ యూత్, ఎకో క్లబ్ ఆధ్వర్యంలో మట్టి గణపతులను తయారు చేశారు. ఈ సందర్భంగా తయారు చేసిన మట్టి వినాయకులను మంగళవారం గ్రామంలో పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొల్లూరి సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓబీసీ పోరుబాట పుస్తకావిష్కరణ

వెల్గటూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ పరికిపండ్ల నరహరి రచించిన ఓబీసీల పోరుబాట పుస్తకాన్ని గోపతి జనార్ధన్ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. వెల్గటూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆలయం ఫౌండేషన్ సీఈఓ రమేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

సన్మానం

జగిత్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఒల్లాల అశోక్‌కు శనివారం ఘన సన్మానం జరిగింది. అశోక్‌ను జగిత్యాల కళాశ్రీ ఆర్ట్ థియేటర్స్ అధినేత గుండేటి రాజు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు మల్లేశం, గంగాధర్, రాము పాల్గొన్నారు.